

# పాహిమామ్

లక్ష్మీపతి

జనం రద్దీగా ఉన్నారు.

ఆ ఊరు చుట్టుపక్కల నించి వచ్చేరు. ఆ ఊరికి కొంచెం దూరా న్నించీ వచ్చేరు. ఆ ఊళ్లో వాళ్లెక్కువ మంది చేరేరు. వాళ్లంతా ఒకర్నొకరు తోసుకు వస్తున్నారు. ఒకరిమీద ఒకరు పడి నిక్కి నిక్కి చూస్తున్నారు.

కొందరి చేతుల్లో పూలమాల లున్నాయి. అందరి కళ్లలోను భక్తి భావం తొణికిస లాడుతూంది. చాలా మంది గుళ్లు కొట్టించుకుని ఉన్నారు. ఆ బోడితలలకి తగ్గట్టు ఇంతలేసి విభూతి రేఖలూ వెలిసేయి. మడి కట్టుకు కొందరు వచ్చేరు. జనంలో పడి ఆ మడి మాట మరిచేరు.

ఆ గుంపులో కంట్రాక్టర్లున్నారు; కాణీకి పనికిరాని దద్దమ్మలున్నారు; పోకిరీగా ళ్లున్నారు; పెద్దలున్నారు. ప్లీడర్లూ, డాక్టర్లూ, మాస్టర్లూ, గుమాస్తాలూ, ఆఫీసర్లూ, ఆడంగులూ; మగ మహారాజులూ — అందరూ, అన్ని రకాలూ ఉన్నారు. అందుచేత ఆ రోడ్డుమీద తోపిడి ఎక్కువగా ఉంది.

ఆయన పాదయాత్ర సాగుతూనే ఉంది!

ఆయన కిరుపక్కలా, ముందూ వెనకా నడిచే జనం నుంచి జై జై నినాదాలు వినిపిస్తున్నాయి. పాటలూ, పద్యాలూ వినవస్తున్నాయి. భజనలు సైతం సాగుతున్నాయి.

ఆయన చిర్నవ్వు చెరక్కుండానే నడుస్తున్నారు!

ఆయన్ని వెంబడిస్తున్న జనం ఎన్నాళ్ల కెన్నాళ్ల కంటున్నారు. మా

బతుకులు పండే యంటున్నారు. ఈ పురం యావత్తూ పావనమైం దంటున్నారు. మా పాపాలు గూడా నశించా యంటున్నారు. మా కళ్లు నేడు పుణ్యం చేసుకున్నా యంటున్నారు.

అందరి బతుకులూ అయన్ని అంటి పెట్టుకున్నాయి మరి!

మనిషి తన తోటిమనిషిని హింసించడం నేర్చుకున్నప్పటి నించీ, పక్కన బతికే వాడిని దోచుకోడం ప్రారంభించినప్పటినించీ పాపం పెరిగి పోతూందని అందరికీ తెలుసు. అక్కడికీ వాళ్లు పూజలూ, వ్రతాలూ చేస్తూనే ఉన్నారా, ఆ పక్కనే దుర్మార్గాలూ మానలేక పోతున్నారా — ఏం చేసేది మరి?... పాపం పెరిగిపోతూనే ఉందిట. దాసుడి తప్పులు దండంతో సరి అనే వివేకం ఉన్న వారు గనక, ఈ స్వాముల వార్లను దిగుమతి చేసుకోవడం నేర్చేసేరు. స్వామి మనుషుల్లోకి వచ్చి నించుని చేతులెత్తి దీవించేస్తే, అప్పటికి జమ చేయపడ్డ పాపాలన్నీ విగదుడుపే గదా! ఆపైన కొత్త పాపాల ఖాతాలు ఏర్పాటు చేసుకుంటే అడిగే దేవు డెవడు? దేవుడేనా? ఏడ్చేడు. ఇంకెక్కడ దేవుడు? దేవుణ్ణి తలదన్నే స్వాములు వచ్చేసిన తరవాత దేవుడితో అవసరమేమి టసలు?

ఆ కారణంగానే శ్రీ స్వామి మౌన స్వామిని రప్పించుకున్నారు!

ఆయన మెళ్లో దండవేసి, ఆయనకి భజన చేసి, ఆయనకోసం బోడితలలు చేసుకుని, ఆయనకోసం మడి కట్టుకుని, ఆయనకోసం ఆయన నామస్మరణ చేసేస్తే — అంతవరకూ చేసిన పాపాలు గో ... విం .. దే గా!

పది మందిని చంపిన పాపం ఒక్క గుడి కట్టించేస్తే పోతుందనే సూత్రాన్ని ఆధారం చేసుకుని వాళ్లు కొన్ని లెఖ్ఖలు చేసుకున్నారు. నిజంగా దేవుడే దిగొచ్చేది, వాళ్ల లెఖ్ఖలు తప్పడానికి వీల్లే దంతే!

నడుస్తున్న స్వామి మౌనముని ఒక చోట ఆగారు. ఆయన ముందో దేవాలయం ఉంది. వారు రెండు చేతులూ ఎత్తి నమస్కారం చేసేరు. చేసి, కదిలేరు.

అక్కడికక్కడే దైవనామస్మరణ సముద్ర ఘోషలా వినిపించేసింది జనం నుంచి.

మనిషి నిత్యమూ ఇంత పవిత్రమైన వాతావరణంలో గాలి పీల్చుకోడం చేస్తే, భువి దివిగా మారి పోదూ! అందుచేత, దివి భువికి దిగొస్తే ఉండబోయే దేవుళ్లకి చోటుఉండదని ఏవో కొన్ని దినాలను మాత్రమే — అదీనూ, స్వామి రాక ననుసరించి దైవనామస్మరణ చేస్తారే గాని, అస్తమానం నీతిగా బతికేందుకు పై మెక్కడిది? ఓపి కెక్కడిది?

స్వామి మౌనముని ఈ పురానికి రావడ మిది ప్రథమం. ఈ స్వామి మౌనముని మనుషులతో మాటాడటం మాని పదేళ్లు గడిచేయి. ఆయన దేవుడితోనే మాటాడుతుంటారని ప్రతీతి. ఏడాది కో మాటు మనుషుల్ని తృప్తిపరిచే నిమిత్తం గంటా గంటన్నర ఉపన్యసిస్తారు. ఆ రోజు దగ్గిరపడిందని స్వామి ప్రథమ శిష్యులు శ్రీ శేషుబాబు మొ న్నామధ్య సెలవిచ్చేరు. ఆ శుభదినం ఈ పురంలోనే జరుగుతుందని కూడా సెలవిచ్చేరు.

అందుకే ప్రజల్లో ఇంత ఉత్సాహం!

స్వామి మౌనముని వారి మందీ మార్బలంతో విడిది చేరుకున్నారు. విడిది ఏర్పాటుచేసిన పెద్ద అతి వినయంగా స్వామీజీ ముందు నిలబడి విన్నవించుకున్నాడు: "తమ రిక్కడ విశ్రాంతి తీసుకోండి. తిరిగి తమ దర్శన భాగ్య మెప్పుడో ఆజ్ఞ సెలవిస్తే, ప్రజలంతా అప్పుడే దర్శనం చేసుకుంటారు."

"అలాగే. నేను కబురు చేస్తాను" అన్నారు శేషుబాబు.

"చిత్తం!" అని నమస్కరించి వెళ్లిపోయేడు పెద్ద.

స్వామి అంతరంగికులు కొందరు స్వామీజీని ఒక అందమైన గదిలోఉంచి, ఆ గదికి తలుపు మూసి హాల్లోకి వచ్చేరు.

శేషుబాబు, స్వామీజీ గదివేపు కదిలివెళ్లేరు.

• • •

"తొరగా తోలు!" అన్నాడు అప్పారావు.

"అయ" అన్నాడు డ్రైవరు.

"అదిరా కథ. కా నారేయ్! నా కసలు ఉపముఖ్యే రావలసింది పోయి మామూలు మంత్రిచ్చేరు. ఏదైతే నేంలే ... ప్రజా సేవకే కదా ఈ పదవులు!" అప్పారావుగారే అన్నారు.

"కాదు మరీ" అన్నాడు వారి చిన్ననాటి చెలికాడు సింహాచలం.

ఆ మిత్రు లెక్కిన కారు సింహాచలానిది. ఆ సింహాచలానికి ఆ కా రొక్కటే కాదు, నాలుగు లారీలూ, రెండు మేడలూ, మూడు మిల్లులూ, అయిదు లక్షలూ వగైరా వగైరా లున్నాయి. బాగా చిన్నతనంలో సింహాచలం అప్పారావును చాలా దూరంగా ఉంచి పలకరించేవాడు. ఈమధ్యనే కొంచెం దగ్గిరై, "ఒరే" అని పిలవడం నేర్చుకున్నాడు. ఇప్పుడు వచ్చి అప్పారావుగారే సింహాచలాన్ని ఒరేగిరేఅంటూ అతని కా రెక్కేసేరు.

"కాదు మరి! తిన్నగా మాటాడు! నే నిప్పుడు మంత్రిని. పవ రెక్కువ."

ఆ మాటకి సింహాచలం నవ్వేసేడు. బాగుండదని మంత్రీ నవ్వేరు.

సింహాచలం ఒళ్లు మండి అన్నాడో, చనువుగా అన్నాడో గాని,

**మనిషి, తోడి మనిషిని హింసించడం నేర్చుకున్నప్పటి నుంచి, పక్కన బతికే వాడిని దోచుకోవడం ప్రారంభించి నప్పటి నుంచి పాపం పెరిగి పోతూందని అందరికి తెలుసు. అయినా పూజలు, వ్రతాలు చేస్తూనే ఉన్నారు; ఆ పక్కనే దుర్మార్గాలూ మానలేక పోతున్నారు. పాపం పెరిగి పోతూనే ఉంది. దాసుడి తప్పు దండంతో సరి అనే వివేకం ఉన్నవారు కనక స్వాముల వార్లను దిగుమతి చేసుకోవడం నేర్చారు.**

చాలా 'ఇది' గానే అన్నాడు:

"ఎంత కష్టపడి సంపాయించేవురా ఈ పదవి? ... నీ జాతకం పవరను ఒప్పుకుంటాను. సమయానికి అందొచ్చింది గనక, వెనకటి మంత్రులు దిగిపోయేరు. వా ళ్లొదిలి వెళ్లిన గద్దె మీద ను వ్వెక్కావు. ఒరే ... అప్పారావూ! జాగ్రత్త సుమీ ... ఇవాళున్నవాడు రే పుండటం లేదు. ఉన్న కాసిని రోజులైనా జాగ్రత్తగా వాడుకుని మమ్మల్ని కనిపెడుతూండు. అంతేగాని, పవరూ గివరూ అని మిడిసిపడిపోవడంలో అదను తప్పిందో ..."

సింహాచలం చేతిని గట్టిగా నొక్కి అన్నారు అప్పారావు: "ఇంక మాటాడకోరేయ్ ... భయంగా ఉంది."

సింహాచలం మళ్లా నవ్వేసి సలహా ఇచ్చేడు.

"భయంట... భయం! ప్రజల్ని ఏలేవా డెప్పుడూ భయపడకూడదు. అవసరమైతే తన భద్రతకోసం నరబలినైనా సహిస్తాడే గాని, మాటకి ఉలిక్కి పడతాడా? ... స్టెడీగా ఉండటం నేర్చుకో. మంత్రిపదవి మజా కాదు. పద వెంత పసందైనదో, అంత గుండె దిటవూ కావాలి."

"తొరగా తోలోయ్!" అన్నారు అప్పారావు.

"అయ" అన్నాడు డ్రైవరు.

* * *

"మంత్రిగా రొచ్చేరు!" అన్నాడు స్వామీజీ అంతరంగికు డొకడు.

శేషుబాబు తాపీగా తల ఊపేడు ప్రవేశపెట్ట మన్నట్టు.

అప్పారావు అడుగులో అడుగు వేసుకుంటూ వచ్చేరు. వచ్చి, హాల్లో నించున్నారు. శేషుబాబు మంత్రిని స్వామీజీ గదిలోకి చేర్చేరు. మంత్రి స్వామీజీకి నమస్కరించి మాటాడటం ప్రారంభించేరు.

"తమ ఆశీస్సువల్ల నేను మంత్రి నయ్యేను, స్వామీ! తమ నింతకుముందు రెండు తడవలు దర్శించుకున్నాను. అతి త్వరలో తమరు మాకు ఉపదేశం చేయబోతున్నట్టు విని వచ్చేను. నేను మంత్రినయ్యే ముందురోజు తమనే తలుచుకున్నాను. విజయం లభించింది."

స్వామీజీ చిర్నవ్వుతో చెయ్యెత్తి మంత్రిని ఆశీర్వదించేరు.

"మహాప్రసాదం" అన్నారు మంత్రి.

"మరో కోరిక, స్వామీ ... రేపు ఏకాదశి. మా ఇంటి కొచ్చి మమ్మల్ని పావనం చేయవలసిందిగా ప్రార్థిస్తున్నాను" అన్నా రాయన.


స్వామీజీ చిద్విలాసంగా నవ్వేసి, ఆ నవ్వు ఒక చోట పూర్తిచేసి, మంత్రి కోరిక అంగీకరించినట్టు తలతో సైగ చేసేరు.


మంత్రి స్వామీజీ పాదాలను తాకి నమస్కారం చేసేరు. స్వామీజీ మంత్రి చేతికి విభూతి ప్రసాదించేరు. విభూతిని కళ్ల కద్దుకుని, గది విడిచి బయటికి వచ్చేరు మంత్రి.


మంత్రి వెనకనే శేషుబాబు వచ్చి జనాంతికంగా అన్నారు:

"మంత్రి వచ్చేడంటే ఎవరో అనుకున్నాను. నిన్ను గుర్తు పట్టాను, అప్పారావ్! చాలా ఆనందంగా ఉంది."

(తరువాయి 38 వ పేజీలో)




**35** వ పేజీ తరువాయి)

మంత్రికేం అర్థంగాక శేషుబాబు వేపు చూస్తూండిపోయేరు.

"తలా గెడ్డం పెంచుకున్నమమ్మల్ని గుర్తించడం కష్టమే. పదిహేనేళ్ల క్రితం నువ్వు మాకు స్నేహితుడివి. మా పేరు శేషుబాబు!"

మంత్రి నిశ్చేష్టులైపోయారు.

"ప్రజాసేవ ప్రారంభించావన్న మాట. సేవలోనే తరించు. అమూల్యమైన నీ సేవకి శ్రీ స్వామీ మౌనముని వర్యుల ఆశీస్సు లెప్పుడూ ఉంటాయి. వెళ్లిరా" అన్నారు శేషుబాబు. అని, వేగంగా తన గదివేపు వెళ్లిపోయేడు.

* * *

ఏమైనాసరే ఈ బతుకిక బతక్కూడదు.

వరసగా మూడు తడవలూ ఎస్. ఎస్. ఎల్. సి. తప్పి కూచున్న పిదప ఇంట్లో వాళ్లచేత చీవాట్లు తప్పించి సుఖం లేదు. ఛావాలి, వెంటనే చచ్చితీరాలని నిర్ణయించుకుని, ఆ రాత్రికి రాత్రే ఇల్లు వదిలి రైలుస్టేషనుకి వచ్చి కూచున్నాడు అప్పారావు.

ఇక్కడి వించి బయలుదేరి వెళ్లే రైలు కిందగానీ, ఇక్కడికి వచ్చే రైలు కిందగానీ శరీరాన్ని ఉంచేసి బతుక్కి స్వస్తి చెప్పాలని ఆత ననుకోవడంవరకూ నిజమే గాని, సరిగ్గా అత నిలాటి పరిస్థితుల్లోనే అక్కడికి వచ్చిన కుర్రాడి వల్ల ఆ నిర్ణయం మారిపోయింది.

ఆ కుర్రాడి పేరే శేషుబాబు.

ఒకర్నొకరు పరామర్శించుకున్నారు. ఒకరి కష్టసుఖా లొకరు చెప్పుకుని ఓదార్పు పొందారు. ఇద్దరూ చావు నిర్ణయానికి చుక్క పెట్టేసి చెన్నపట్నం వెళ్లే రైల్లో ఎక్కి కూచున్నారు.

చెన్నపట్టణంలో వాళ్లిద్దరూ కొన్నాళ్లు కడు కష్టా లనుభవించి కలిసి బతికేరు. ఇంకా ఎన్నాళ్లలా కొరగాని బతుకు బతికేవారో గాని, ఈలోగా అప్పారావు అన్నగారు వెతుక్కుంటూ వచ్చి అప్పారావుని పట్టుకుని ఇంటికి తీసుకుపోయేరు.

ఇంటి దగ్గిర అప్పారావుకి వాళ్ల పెద్దలు చాలా హామీలిచ్చేరు. "చదవాలనుకుంటే మళ్లా చదువు. ఎన్నిసార్లయినా ఫెయిలవ్వు. మరేం ఫర్లేదు. పారిపోవద్దు. చచ్చిపోవద్దు. చదవడానికి బద్ధకమైతే చదువు మాని ఇంట్లో కూచో. మే మెవ్వరం నిన్ను ఇబ్బంది పెట్టం గాక పెట్టం. ఇంకె

ప్పుడూ వెళ్ళిపోకురా, అప్పారావ్'' అని వాళ్ళు ఎంతగానో ఏడ్చేసేరు.

వాళ్ళందరి మీదా జాలి కలిగి అప్పారావు ఇంటిపట్టునే కూచున్నాడు. ఆ రోజుల్లోనే అతనికి పెళ్ళి కావడం, తద్వారా అతనో కౌన్సిలర్ మహాశయుడికి అల్లుడవడం, ఆపైన అతని తండ్రి పోవడం మూలంగా ఆస్తి పంపకాలు జరగడం మొదలైనవన్నీ సక్రమంగా నెరవేరేయి.

మామగారి శిక్షణలో అతను మెల్లిగా రాజకీయం నేర్చుకున్నాడు. మెట్లు కట్టుకున్నాడు. ఎస్.ఎస్.ఎల్.సి. తప్పినవాడికీ, సరిగ్గా సంతకం చేయడమే తెలీనివాడికీ అనువైన ఉద్యోగం రాజకీయమేనని అతను గ్రహించడానికి ఆట్టే కాలం పట్టలేదు. బి.ఎ.లూ, ఎమ్.ఎ.లూ మాకు దిక్కేది భగవంతుడా! అని ఏడవడానికి వాళ్ళ చాతకానితనమే కారణమని, ఏ డిగ్రీలూ లేకుండా ప్రజల్ని ఏలే వృత్తి ద్వారా లక్షలు సంపాయించడం మాబోటి మేధావులకే తగునని అతను సులువుగా అర్థం చేసుకున్నాడు. అందువల్ల, అతను మామ అండన చేరి త్వరత్వరగా రాజకీయ సోపానాల్ని వల్లెవేసి, చివరికి స్థితి కెగిరిపోయేడు.

తొందరపడి ఆ రైలు స్టేషను దగ్గిర ఆత్మహత్య చేసుకున్నా, చెన్నపట్టణంలో చివరి దశకి లొంగిపోయి జేబులు కొట్టడం ప్రారంభించినా, ఈవేళ ఇంతమంది నోళ్ళు కొట్టే వృత్తికి దూరమై పోదునుకదా! అని ఆయన ఆలోచించలేదుగాని, అవతల ఆ శేషుబాబు హోదాని తలుచుకుని ఆఘమేఘాల ఆశ్చర్యపోయేరు.

కారు వారి భవంతిముందాగడం గమనించే స్థితిలో లేని మంత్రివర్యులు, డ్రైవరు పిలుపుతో ఉలిక్కిపడి చుట్టూచూచి, "అప్పుడే వచ్చేశామా?'' అన్నారు.

"చిత్తం'' అన్నాడు డ్రైవరు.

* * *

మదరాసులో అప్పారావుతో చేయి కలిపి బతికే బతుకులో అప్పారావు చెయ్యిచ్చి వెళ్ళిపోయేడు. చెప్పా చెయ్యకుండా ఎవడో అన్నగా డొచ్చేడు గదా అని మిత్రుణ్ణి వదిలి వెళ్ళిపోవడమేనా?

అదిగో అప్పటినించే శేషుబాబు బతుకు చీకటైపోయింది.

రెండో తడవగూడా ఆత్మహత్యా ప్రయత్నం చేసేడు గాని, అదీ ఫలించలేదు. లోపల బతుకుతున్న ఆశాజీవుడందుకు సుతరామూ ఒప్పుకోలేదు.

కాళ్ళరిగేలా తిరిగేవాడు. హోటల్లోనూ, సినిమా హాల్లోనూ, రైల్వే స్టేషన్లోనూ — వీలైన ప్రతి చోటా ఒళ్ళొంచి పనిచేసి పైకం కూడబెట్టేవాడు. తిండికి బహు తక్కువగా ఖర్చుచేసి, ఎక్కడో ఒక అరుగుమీద నిద్రపోయేవాడు.

ఈ గాలి బతుకు నే నింక బతకలేను. నేను సుఖంగా, దర్జాగా బతికేందుకు తగ్గ ఉద్యోగమూ దొరకదు. అయితే, నే నేం చేయాలి? ఏం చేయాలాని అతను చాలా రాత్రిళ్ళు ఆలోచించేడు.

మనసులో మెరుపొకటి మెరిసింది.

ఎందుకూ పనికిరాని రాతిని సంపాయించి, దాని కిన్ని కుంకుమ బొట్లు తగిలించి, పదిమంది చూస్తుండగా దానికి నమస్కారం చేస్తే, ఆ రాయే దేవుడైపోయే ప్రమాదాన్ని అతను ఆలోచించేడు.

పాపం చేస్తూనే, ఆ పాప పరిహారార్థం మనిషి చేసే ప్రయత్నం, దాని కయ్యే ఖర్చూ అంచనా వేసేడు. చాలా ప్రమాణాలుగా మనిషి చేస్తున్న పాపాలన్నీ చదివేసి, "కనక ఓ మనిషీ! నువ్వు పాపివై పోతున్నావు సుమీ! జాగ్రత్త'' అని ఎవడైనా వేదిక ఎక్కి మనుషుల్ని హెచ్చరిస్తే, వా డెంతటి మహాపాపి కానివ్వు, ఆ హెచ్చరించినవాడికి చేతులెత్తి నమస్కరించే అమాయకుల్ని దృష్టిలో ఉంచుకున్నాడు.

ఇదే మంచి వృత్తి అని అతనో నిర్ణయానికి వచ్చేడు. తప్పనిసరిగా ఈ వృత్తినే ప్రారంభించి బాగుపడదా మనుకున్నాడు.

అయితే, ఇక్కడో చిక్కు ఉద్భవించింది.

చొక్కా, లాగూ తొడుక్కుని, నీతిపాఠాలు చెబుతాను వినండంటే, మనిషి వినడు; కొడతాడు. ఆకాడికొస్తే ఏది నీతో, ఏది అవినీతో మనిషికి తెలీదు గనకనా? అందుచేత వినబోయే మనిషి నాకర్షించేందుకు చెప్పబోయే మనిషి కో ప్రత్యేకమైన వేషం కావాలి.

కాషాయవస్త్రాలూ, చెక్కచెప్పులూ, చేతిలో రుద్రాక్షమాలా, మొహాన విభూతి రేఖలూ, వెంట కనీసం ఒక శిష్యుడూ కావాలి. వీటన్నింటికంటె ముఖ్యం — ఆ మొహంలో ఎదటి మనిషిని తిమ్మిరెక్కించి మాయచేసే వెలుతురుండాలి. సరిగ్గా ఈ వెలుతురే శేషుబాబు మొహంలో లేదు. అతని మొహం సంగతి అతనికి బాగా తెలుసు. ఆ మొహంతో జనాభాని మోసం చేయడం కష్టం!



పండిన వయసు ఫోటో-పి. ఎమ్. వరప్రసాదరావు (గుంటూరు-2)

అందువల్ల వెలుతురు వెదజల్లే మొహం కొరకు అత నెంతోకాలం ఎదురుచూసేడు. చివరికో నాడు టిక్కెట్టు లేదని రైల్లోంచి గెంటబడిన సాధువొకడు దొరికేడు. వాడి మొహంలో కావలసినంత వెలుతురుంది. వేషం గూడా సరిగ్గా సరిపోయింది. వాడి రోజులు బావుండక రైల్లోంచి గెంటబడ్డాడే గాని, లేకపోతే ఈ వేళకే అతను దేవుడైపోయి ఉండే పని.

సాధువుకి కమ్మటి భోజనం పెట్టించి వివరాలడిగేడు. ఆ సాధువు ఉత్తర దేశస్థుడని తెలిసిన తరవాత మరింత సంతోషించేడు. భోజనం పిదప విశ్రాంతి తీసుకోమని సలహా ఇచ్చి, వెంటనే పథకాన్ని తయారు చేసుకున్నాడు. సాధువు విశ్రాంతి తీసుకోవడం పూర్తయిన తరవాత చెప్పదలిసిందంతా టూకీగా చెప్పేడు.

"నా వెంట రా. నా భాష తెలీకపోయినా ఫర్వేదు. ఒక రకంగా తెలీకపోవడమే మంచిది. నువ్వసలు నోరెత్తకు. సంవత్సరానికో తడవే నోరెత్తి మాటాడతావు. ఆ మాటలైనా బహు కొద్ది. చాలా సుళువు. 'నీతిగా బతకండిరా, గాడిదలూ' అని తిట్టి ఊరుకో. ఎలా తిట్టాలో మెల్లిగా నేనే చెబుతాను. అయిందా, సంవత్సరంలో ఆ ఒక్క రోజు మినహాయించి నువ్వెప్పుడూ మాటాడకు. ఇబ్బంది లేదు గదా. ఇదిగో నేను నీ శిష్యుణ్ణి. నీ పేరు మౌనముని. శ్రీ స్వామీ మౌనముని. హిమాలయాల నుంచి వచ్చేవు. మా దేశంలో స్థిరపడాలని ఉంది. అంతే. ఈమాత్రం జాగ్రత్తలు తీసుకుని సిద్ధంగా ఉండు. నెల రోజుల్లో మనం మా దేశంలో ధ్వజమెత్తుతాం. అక్కడినించి కనకవర్షమే! నా దరిద్రంతోపాటు నీ దరిద్రమూ దెబ్బతో ఎగిరిపోవాలి. అర్థమయిందా?''

సాధువు మౌనంగా తలూపేడు.

వీ డెవడో అసాధ్యుడు అనుకున్నాడు శేషుబాబు.

తన కథని నెమరేసుకుంటూ శేషుబాబు ఆనందించలేదుగానీ, చెయ్యిచ్చి వెళ్ళిపోయిన అప్పారావు దశకి ఆశ్చర్యపోయేడు.

మనోహరమైన పట్టుపరుపుల మంచం మీద మేను వాలుస్తూ ప్రభువుని తలుచుకున్నారు శేషుబాబు.

"హే! ప్రభో! నన్నూ, మిత్రుడు అప్పారావునూ ఆదరిస్తున్న ఈ మూర్ఖుల్నింకా పరమమూర్ఖుల్ని చేసి, మమ్మల్ని కాపాడు! పాహిమామ్, ప్రభో, పాహిమామ్!'' ★